క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



చిట్యాల: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఐత రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ జయశ్రీ వ్యక్తిగత పనుల కోసం సెలవుపై వెళ్లింది. దీంతో ఎంపీఓగా పని చేస్తున్న రామకృష్ణకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక



మల్హర్: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు మండల కేంద్రం తాడిచర్ల గ్రామానికి చెందిన విద్యార్థి తిర్రి గ్రీష్మంత్ ఎంపికయ్యాడు. గ్రీష్మంత్ రేగండ మండలంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. కాగా ఆదివారం హనుమకొండలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలో పాల్గొని విజయం సాధించాడు. దీంతో ఈనెల 13న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో గ్రీష్మంత్ పాల్గొననున్నాడు.

బీజేపీ నాయకుడికి నివాళి



రేగొండ(గోరికొత్తపల్లి): గోరికొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు తుమ్మనపల్లి మోహన్‌రావు సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, నాగపూరి రాజమౌళిగౌడ్, వెన్నంపల్లి పాపన్న, కన్నం యుగదీశ్వర్, లింగంపల్లి ప్రసాద్‌రావు, ప్రభాకర్, బట్టు రవి, రాజేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

మొగుళ్లపల్లి: రైలు కిందపడి మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వే స్టేషన్ పరిధిలోని బిజిగిరి షరీఫ్ సమీపంలో చేసుకుంది. సెల్‌ఫోన్, బైక్ ఆదారంగా మొగుళ్లపల్లి మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించి సమాచారం అందించారు. మంచిర్యాల రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని కొడారి కొమురయ్య లక్ష్మి దంపతుల కుమారుడు శ్రీకాంత్(27) డిగ్రీ పూర్తి పూర్తి చేశాడు. ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటూ తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనుల్లో సహకరించేవాడు. శ్రీకాంత్ ఇంట్లో ఉన్న కొంత డబ్బును సొంత అవసరాలను వాడుకోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన శ్రీకాంత్ సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిపోయాడు. కాగా, కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వే స్టేషన్ పరిధిలోని బిజిగిరి షరీఫ్ గ్రామం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాంత్ ఆత్మహత్య విషయం మొగుళ్లపల్లిలో తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అమలుకున్నాయి. శ్రీకాంత్‌కు వివాహం కాలేదు. చేతికి అందివచ్చిన కొడుకు మృతిచెందడంతో తలిదండ్రులు బాధ చూసి గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మల్లమ్మ(ఫైల్)

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన తీగల మల్లమ్మ (110) శతాధిక వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నవాబుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తీగల సారయ్య తల్లీ మల్లమ్మ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతిరాలికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు



కాటారం: కాటారం మండలం మేడిపల్లి శివారు అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్ మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన రామిడి సాయిరాం, మహేశ్ అనే ఇద్దరు పనుల నిమిత్తం భూపాలపల్లి వైపు వెళ్తున్నారు. మేడిపల్లి శివారు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని బొగ్గు లారీ బైక్‌ను ఢీ కొనడంతో కిందపడ్డారు. బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. 108 వాహనంలో భూపాలపల్లి ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

వైఎస్సార్ సేవలు మరువలేనివి



టేకుమట్ల: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



భూపాలపల్లి రూరల్: గుర్రంపేటలో..

టేకుమట్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్సార్ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మునుపెన్నడూ లేని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్‌పాణి, కాంగ్రెస్ నాయకులు రాజమౌళి, మాదం కొమురయ్య, శాస్త్రాల కిరణ్, ఆడెపు సంపత్, వంగ నరేష్, రఘోత్తంరెడ్డి, రాజేందర్, పైడిపెల్లి సతీష్, సరోత్తంరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: వైఎస్సార్ చిరస్మరణీయుడని, ప్రభుత్వాలు మారిన వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకలు ఇప్పటికీ అమలవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధికార ప్రతినిధి కోడూరి రమేశ్ అన్నారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని గుర్రంపేటలో కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మటాట్లడుతూ.. వైఎస్సార్‌ను ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు మరవలేరని, పేదలగుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ భూపాలపల్లి ఎస్టీ సెల్ అధ్యక్షుడు పోరిక సమ్మయ్య, నాయకులు మారం సుమన్ రెడ్డి, అరుణ్ లాల్, జీడి రాజు, తాళ్లపల్లి భానుచందర్, తాళ్లపెల్లి శ్రీనివాస్, సుమన్, ముక్కెర సాయిలు, గోవింద్ నాయక్, శ్రీనివాస్, దేవేందర్, రవీందర్, భాస్కర్, సారయ్య, దూడపక శివ, భిక్షపతి, జంపయ్య, బాలాజీ, చిరంజీవి, శంకర్, ఎల్ల గౌడ్ మహేందర్, నరేష్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

మల్హర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని అధిక స్థానాల్లో గెలిపించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మంథని అసెంబ్లీ కన్వీనర్, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ మల్కా మోహన్ రావు అన్నారు. సోమవారం తాడిచర్లలో పార్టీ మండల అధ్యక్షుడు ముడితనపెల్లి ప్రభాకర్ ఆధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ.. ఫోన్ నంబర్ 88000 02024కు మిస్డ్ కాల్ పద్ధతి ద్వారా సభ్యత్వ నమోదు గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ సభ్యత్వం కార్యక్రమాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు మండల్ కో కన్వీనర్ లింగన్నపేట అశోక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు నిషాన్ పాషా, ప్రశాంత్, రమేశ్, నవీన్, రాజయ్య, శ్రావణ్, రాకేశ్, నాగరాజ్, సంజీవ్, తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో బూటారం గ్రామస్తులు



గిరిజన భవనంలో బూటారం గ్రామస్తులు



భోజనం చేస్తున్న ముంపు బాధితులు

ఏటూరునాగారం: మండలంలోని బూటారం గ్రామం చుట్టూ జంపన్నవాగు వరద ఉధృతి ఉండడంతో గ్రామస్తులను మండల కేంద్రంలోని గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అయితే ఆదివారం, సోమవారం నుంచి ఈ కేంద్రంలోనే శరణార్థులు సేద తిరుతున్నారు. వారికి గ్రామ పంచాయతీ, ఐటీడీఏ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. తాగునీరు, కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. వరద ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో ఇక్కడే వారు తల దాచుకున్నారు. ఇంటిల్లిపాది సైతం గొడ్డు గోదా, సామగ్రిని వదిలేసి తరలివచ్చినట్లు బాధితులు తెలిపారు. వాగు ఉధృతి మరింత ఎక్కువైతే ప్రాణ, ఆస్తినష్టం జరిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు 232 మందిని తరలించినట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు. వర్షాలు, వరదలు తగ్గే వరకు ఇక్కడే ఉంటారని వెల్లడించారు.

శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

కాటారం: కాటారం గ్రామ పంచాయితీ పరిధిలోని ఊర చెరువు, ఎర్రగుంట, తిమ్మనకుంటతో పాటు మండలంలోని పలు చెరువుల శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అసలైన సర్వే నంబర్ ఫిక్సింగ్ చేయించకుండా స్థానిక మండల నాయకుల ప్రలోభాలకు లోబడి తప్పుడు సర్వే చేసి సుమారు 30 మీటర్ల లోపలి వరకు చెరువు శిఖాలను కుదించి ఇష్టానుసారంగా హద్దులు నిర్ణయించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో హైడ్రా ఎలాగో కాటారం చెరువుల ప్రొటక్షన్ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. హద్దురాళ్లు, ట్రై ఆంగిల్ దిమ్మెలను కూడా తొలగించి అక్రమ కట్టడాలు నిర్మించారని అన్నారు. కబ్జాకు గురవుతున్న చెరువులకు శిఖం హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులలో గల నిర్మాణాలన్నింటిని కూల్చివేసి అట్టి భూభాగాలన్నింటిని పరిరక్షించాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

కాటారం(మహాముత్తారం): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పరిసరాలు, తరగతి గదుల నిర్వహణ, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని ఆరా తీశారు. తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులకు గణిత సబ్జెక్ట్ బోధించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి మండలంలోని వాగుల పరిస్థితిని పరిశీలించారు. వాగులు ఉప్పొంగితే తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకాధికారి అధికారులకు సూచనలు చేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

ములుగు రూరల్: వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని సర్వాపూర్–జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గులవాగు వరద ఉధృతిని ఆయన పరిశీలించి మాట్లాడారు. వరదలతో జిల్లాలో వందలాది ఎకరాలు నీట మునిగాయని అధికారులు పంటల నష్టం అంచనా వేయాలని అన్నారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు మూడు నెలల రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు అందించాలని అన్నారు. ఇటీవల వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. బొగ్గుల వాగు వరద కారణంగా జగ్గన్నగూడెం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని డిగ్రీకళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 4లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు రెండు జతలు కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. అదనపు అర్హతలు నెట్, సెట్ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

తేలికపాటి వర్షం

కాటారం: మండలంలో సోమవారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. రెండో రోజుల పాటు భారీగా కురిసిన వర్షం కొంత పాటి విరామం ఇచ్చింది. దీంతో పలు గ్రామాలకు మధ్యలో ఉన్న వాగుల్లో వరద నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలు సజావుగా సాగాయి. పత్తి చేలలో వరద నీటి నిల్వలు కొంత మేర తగ్గినప్పటికీ రైతులకు మాత్రం తీవ్ర నష్టం చోటుచేసుకుంది. వర్షానికి ఇబ్రహీంపల్లికి చెందిన దబ్బెట మొండయ్య ఇంటి గోడ కూలిపోయింది.

బీర్లు దొరకట్లే..

కాటారం: కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల్లోని వైన్‌షాపులలో కింగ్‌ఫిషర్ బీర్లు దొరకడం లేదని కాటారం మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాపు సోమవారం జిల్లాకేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. వైన్‌షాపుల నిర్వాహకులు సదరు కంపెనీల బీర్లను బెల్టుషాపులకు పంపిస్తున్నారని అన్నారు. దీంతో బెల్ట్‌షాపుల్లో కొనుకోవాల్సి వస్తోందన్నారు.

చిరువ్యాపారులను ఖాళీ చేయించిన అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి తీరం వద్ద చిరుదుకాణాదారులను పంచాయతీ, పోలీసు అధికారులు సోమవారం రాత్రి ఖాళీ చేయించారు. గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ఖాళీ చేయించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



బిగిస్తున్న సీసీ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్సై

పలిమెల: నేరాలు తగ్గించడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ఎస్సై తమాషారెడ్డి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్సై ఆధ్వర్యంలో సోమవారం పంకెన గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలు జరగకుండా నిరోధించడానికి సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ప్రజల సహకారంతో త్వరలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక



చిట్యాల: మున్నూరు కాపు సంఘం చిట్యాల గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఆకుల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా అల్లం తిరుపతి, ఉపాధ్యక్షులుగా ర్యాకం రవీందర్, ఆకుల ఆదిరెడ్డి, కోశాధికారిగా ఆకుల హరీశ్, కార్యదర్శులుగా సాదుల రవీందర్, కొడెల అశోక్, గాజె రవీందర్, ప్రచార కార్యదర్శిగా ఆకుల రాజులను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా ఆకుల సాంబయ్య, కొడెల నరేష్, సాదుల రాజు, కొడెల మహేష్, గౌరవ అధ్యక్షుడిగా ఆల్లం రవీందర్, ముఖ్య సలహాదారులుగా కొడెల రాయమల్లు, శేరి రవీందర్, ఆకుల ఐలయ్య, కొడెల రవీందర్‌లను నియమించారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు



విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భూపాలపల్లి రూరల్: భారీ వర్షాల కారణంగా జిల్లాలో విద్యుత్ సమస్యలు లేకుండా సత్వర చర్యలు చేపడుతున్నట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ మల్సూర్ నాయక్ తెలిపారు. సోమవారం జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులతో కలిసి మల్సూర్ నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు విరిగి స్తంభాలపై పడటంతో 223 స్తంభాలు, 9 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయన్నారు. వరదల వల్ల నీట మునిగిన సబ్ స్టేషన్లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ విద్యుత్‌ను సరఫరా అందిస్తున్నామన్నారు. విద్యుత్ సామగ్రి సరిపడా అందుబాటులో ఉందని, సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే తమ సిబ్బంది మరమ్మతులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌పై జాగ్రత్త వహించాలని, విద్యుత్ స్తంభాలు, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దన్నారు. స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టవద్దని కోరారు. విద్యుత్ అంతరాయం, ఇతర సమస్యల కోసం 79016 28364 నంబర్ లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912, 18004250028కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



పిల్లలకు అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీఓ అవంతి

చిట్యాల: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ అవంతి అన్నారు. సోమవారం మండలంలోని గోపాలపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ అవంతి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు ప్రతి రోజు గ్రామాల్లో దొరికే ఆకు కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలని కోరారు. అనంతరం ఇద్దరు గర్భిణులకు సీమంతాలు చేసి, చిన్న పిల్లలకు అన్నప్రాసన చేయించారు. అలాగే గ్రామంలో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

'పాలకుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం



రాళ్లవాగును పరిశీలిస్తున్న గోవింద్ నాయక్

ములుగు: పాలకుల నిర్లక్ష్యం వల్లనే రాళ్లవాగు పనుల్లో జాప్యం జరుగుతుందని గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం రాళ్లవాగును ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న బండారుపల్లి శివారులో జూన్ నెలలో రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు కలిగి అన్ని వైపులా ఉన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ స్థంభించిందని అన్నారు. ఈ విషయంపై గ్రామాల ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్ల వాగుపై శాశ్వత బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. జిల్లాలోని 163వ జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి యమున

మంగపేట: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చినపెల్లి యమున అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. నలుగురు గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రతలపై పలు సూచనలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటి సర్వే చేపట్టి 10 మంది జ్వర పీడుతులకు మలేరియా పరీక్షలు నిర్వహించారు. వారికి నెగిటీవ్ రిపోర్టు రావడంతో మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల గురించి, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్ష కాలంలో తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సారమ్మ, ఆశ వర్కర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది నుంచి ఎదురుచూపు

- లభించని శ్రీమాన్ ఆచూకీ
- కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కలిసిన తల్లిదండ్రులు



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసిన శ్రీమాన్ తండ్రి సమ్మిరెడ్డి, తదితరులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని బయ్యక్కపేట గ్రామానికి చెందిన గుర్రం శ్రీమాన్ నేవీలో పనిచేస్తూ షిప్‌లో గల్లంతై ఏడాది గడిచినా ఆయన ఆచూకీ మాత్రం లభించలేదు. ఏడాది నుంచి శ్రీమాన్ తల్లిదండ్రులు కుమారుడి ఆచూకీ కోసం ఎదురుచూస్తున్నారు. గుర్రం సమ్మిరెడ్డి, రమ దంపతుల కుమారుడు శ్రీమాన్ 2023లో ఇరాన్ దేశంలో ప్రైవేట్ నేవీ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. గతేడాది డిసెంబర్ 23న నదిలో షిప్ మునిగిపోవడంతో షిప్‌లో ఉన్న శ్రీమాన్ గల్లంతయ్యాడు. ఏడాది నుంచి తల్లిదండ్రులు అతని ఆచూకీ కోసం నిద్రహారాలు లేకుండా ఎదురుచూస్తున్నారు. కంపెనీ ప్రతినిధులను తల్లిదండ్రులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరిన ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చివరికి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఫోన్ ద్వారా తెలిపారని తల్లింద్రులు చెబుతున్నారు. జిల్లా అధికారులను, మంత్రి సీతక్కను కలిశారు. ఇటీవల తల్లిదండ్రులు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి శ్రీమాన్ ఘటన వివరాలను వివరించారు. ప్రైవేట్ నేవీ కంపెనీ ప్రతినిధులతో గానీ భారతీయ రాయబారులతో సంప్రదించి వీలైనంత త్వరగా గల్లంతైన శ్రీమాన్ ఆచూకీ కోసం కృషి చేస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శ్రీమాన్ ఆచూకీ తెలుసుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.